సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



శ్రీవారి ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గురువారం తణుకు మండలం పైడిపర్రుకు చెందిన అలుమోలు సుబ్బారావు రూ. 3,65,000 విరాళంగా అందజేశారు.



సర్వాభరణం బహూకరణ

నిడమర్రు: బువ్వనపల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి దాత సంకు పుల్లయ్యనాయుడు, సత్యనారాయణ సోదరులు సర్వాభరణం బహూకరించారు.

సరస్వతీ అమ్మవారికి పూజలు



జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం అయ్యప్ప క్షేత్రం ఉపాలయంలో కొలువై ఉన్న జ్ఞాన సరస్వతి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



రేలంగిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి కారుమూరి

ఇరగవరం: రేలంగి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ గౌరవ అధ్యక్షుడు వడ్డి మార్కండేయులు, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, గ్రామ పార్టీ అధ్యక్షుడు పులుపు అనిల్, తణుకు మండల అధ్యక్షుడు పోలేపల్లి వెంకట ప్రసాద్, పులుపు శ్రీను, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మెహర్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

గూడెం రెవెన్యూ డివిజన్‌లోకి గణపవరం

గణపవరం: గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేయబోయే తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్‌లో కలపడానికి ప్రభుత్వం రాజపత్రం విడుదలచేసింది. ఈ మేరకు గురువారం దీనిపై అభ్యంతరాలు ఉంటే 30 రోజుల లోపు తెలియచేయాలని కోరారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏలూరు జిల్లాలో ఉన్న గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలపడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ఈ మేరకు గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలపడానికి భీమవరం రెవెన్యూ డివిజన్‌లోకి మారాల్సిఉంది. ఈ లోగా కొత్తగా జిల్లాలో తాడేపల్లిగూడెం రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. దీంతో తాడేలిపల్లి గూడెం, తణుకు, ఇరగవరం, అత్తిలి, పెంటపాడు మండలాలతోపాటు కొత్తగా పశ్చిమ గోదావరి జిల్లాలో కలిసిన గణపవరం మండలాన్ని కలిపి తాడేపల్లిగూడెం డివిజన్ ఏర్పాటు చేయనున్నారు.

బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డు ప్రమాణం

బలివే(ముసునూరు): బలివే దేవస్థాన ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ అధ్యక్షతన గురువారం దేవస్థాన ప్రాంగణంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సమక్షంలో ప్రమాణం చేశారు. చైర్మన్‌గా నాగుల నాగేశ్వరరావుతో ఈఓ తల్లాప్రగడ విశ్వేశ్వరరావు ప్రమాణం చేయించారు. అనంతరం సభ్యులు ప్రమాణాలు చేశారు.

జూనియర్ సివిల్ జడ్జిల నియామకం

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు జూనియర్ సివిల్ జడ్జిలను నియమిస్తూ హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లా నుంచి వి.రఘునాథ్‌ను ఏలూరు ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా, మంగళగిరి నుంచి ఎస్.వాసుదేవ్ ఏలూరు సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యారు. తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పి.బాబు, జంగారెడ్డిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా కె.రాజరాజేశ్వరి నియమితులయ్యారు.

అక్రమ మందుల దందా

- విచ్చలవిడిగా మత్తు మందుల విక్రయాలు
- జాబితాలో నిద్రమాత్రలు, అబార్షన్ కిట్‌లు, వయాగ్రా
- ఉమ్మడి జిల్లాలో డ్రగ్ అధికారుల దాడులు



తణుకులో ఇటీవల ఔషధ నియంత్రణ అధికారులు స్వాధీనం చేసుకున్న మందులు

తణుకు: వైద్యుల మందుల చీటీలపై విక్రయించాల్సిన మందులు కొందరికీ సులువుగా దొరుకుతున్నాయి. ఈ నేపథ్యంలో తణుకులో తీగ లాగితే... డొంక మాత్రం జిల్లాలు, రాష్ట్రాలు దాటింది. ఈ మందుల విక్రయాలపై అధికారులు జరుపుతున్న దాడుల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవల ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చేపట్టిన దాడుల్లో పెద్ద ఎత్తున అక్రమ మందులు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తణుకు పట్టణంలో తీగ లాగిన అధికారులు ఈ మందులు ఎక్కడ నుంచి వస్తున్నాయనే విషయంపై ఆరా తీస్తున్నారు. తణుకు పట్టణానికి చెందిన వ్యాపారి ఒకరు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈనెల 6న రాత్రి నిద్రమాత్రలు మింగిన అతను అపస్మారక స్థితిలోకి చేరుకోవడంతో మరుసటి రోజు తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఈ నెల 8న మృతి చెందారు. ఈ సంఘటనతో తణుకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిడ్ ఆలీ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి దాడులు చేపట్టారు. ఇంతవరకు అధికారులు నిర్వహించిన దాడుల్లో సుమారు రూ. 25 లక్షల వరకు అక్రమ మందులు స్వాధీనం చేసుకున్నారు.

మందుల చీటీ ఉంటేనే

సాధారణంగా నిద్రమాత్రలు విక్రయించాలంటే వైద్యులు రాసిన మందుల చీటీ ఉండాలి. అయితే తణుకు పట్టణంలోని పలు మందుల దుకాణాల్లో ఎలాంటి మందుల చీటీ లేకుండాలనే నిషేధిత మందులు విక్రయిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ జాబితాలో నిద్రమాత్రలతోపాటు వయాగ్రా, గర్భవిచ్ఛిత్తికి వినియోగించే మాత్రలు పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. ఇందుకు ఇటీవల అధికారుల దాడుల్లో స్వాధీనం చేసుకున్న మందులే నిదర్శనం. ఇదిలా ఉంటే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి తణుకు పట్టణంలోని రాష్ట్రపతి రోడ్డులో ఒక మందుల షాపులో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసినట్లు సమాచారం. ఈ సమాచారంతోనే నిఘా పెట్టిన ఔషధ నియంత్రణ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన ముగ్గురు వ్యక్తులపై కేసులు నమోదు చేసిన అధికారులు వీరిచ్చిన సమాచారంతో భీమవరం, ఏలూరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమ మందులను స్వాధీనం చేసుకున్నారు.

పొరుగు రాష్ట్రాల నుంచి...

అక్రమ మందులను పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాదు ప్రాంతాల్లో ప్రముఖ కంపెనీల్లో మేనేజర్లుగా వ్యవహరిస్తున్న కొందరు అక్రమార్కులు ఈ చీకటి వ్యాపారంలో ఉన్నారని అనుమానిస్తున్నారు.

బెంగళూరు నుంచి ఏలూరుకు దిగుమతి చేసుకుంటున్న అక్రమార్కులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏజెంట్లను నియమించుకుని వారి ద్వారా హోల్‌సేల్, రిటైల్ మందుల షాపులు, ఆర్ఎంపీ, పీఎంపీలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఎలాంటి అనుమానం రాకుండా ఈ అక్రమ రవాణాకు ఆర్టీసీ కార్గోను వాడుకుంటున్నారు. తాజాగా భీమవరంలో ఆర్టీసీ కార్గో ద్వారా మందులు రవాణా చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

పార్శిల్ రూపంలో అబార్షన్ కిట్‌లు



భీమవరంలో స్వాధీనం చేసుకున్న అక్రమ అబార్షన్ కిట్‌లు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం, చుట్టు పక్కల ప్రాంతాల్లోని కొందరు ఆర్ఎంపీలు, క్లినిక్‌ల నిర్వాహకులకు అక్రమ అబార్షన్ కిట్‌లు మెడికల్ ఏజెన్సీల్లో పనిచేసే వారి ద్వారా చేరుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి పార్శిల్ రూపంలో కొరియర్, ట్రాన్స్‌పోర్టు సర్వీసు ద్వారా అందుతున్నాయి. వీటిని రహస్యంగా అబార్షన్‌లకు ఉపయోగించుకుని డబ్బులు దండుకుంటున్నారు. అక్రమ అబార్షన్ కిట్‌లపై ఔషధ నియంత్రణ అధికారులకు సమాచారం అందితే వారు దాడులు చేసి మందులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో భీమవరంలో సుమారు 2 లక్షల విలువ చేసే కిట్‌లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయగా తాజాగా బుధవారం రూ.3.90 లక్షల విలువ చేసే అబార్షన్ కిట్‌లు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

కోటగిరిని కలిసిన డీఎన్నార్, జయమంగళ



ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను కలిసిన ఎమ్మెల్యే డీ.నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే జయమంగళ వెంకటరమణ

దెందులూరు: ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను గురువారం ఆయన నివాసంలో కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నేత జయమంగళ వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. జయమంగళ వెంకటరమణ గురువారం సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి ఎంపీ శ్రీధర్‌ను కలిశారు. కొల్లేరులో పార్టీ అభివృద్ధి, బలోపేతానికి సమన్వయంతో కృషి చేయాలని ఎంపీ కోటగిరి అన్నారు. వారి వెంట ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ పళ్ళెం ప్రసాద్ ఉన్నారు.

నేడు పోలవరం ప్రాజెక్టు పరిశీలించనున్న మంత్రులు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం పరిశీలించనున్నారు. ప్రాజెక్టు నిర్మాణ పనుల్లో భాగంగా దిగువ కాఫర్‌డ్యామ్ పనులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబుతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని పరిశీలిస్తారు.

ఫేషియల్ అటెండెన్స్ తప్పనిసరి

కలెక్టరు పి.ప్రశాంతి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రభుత్వ ఉద్యోగులకు ఫేషియల్ అటెండెన్స్ ఈ నెల ఒకటి నుంచి అమల్లోకి తెచ్చామని, ఫేషియల్ అటెండెన్స్ నూరు శాతం నమోదు కావాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరు కార్యాలయంలోని స్పందన సమావేశ మందిరంలో గురువారం జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టరు అటెండెన్స్ విధిగా నమోదు చేసుకోవాలని లేదంటే సంబంధిత అధికారిపై చర్యలు తీసుకుంటామన్నారు. స్పందనలో వివిధ సమస్యల పరిష్కారం కోసం నమోదైన సరైన సమయంలో పరిష్కరించడంతో పాటు.. లబ్ధిదారులు సంతృప్తి చెందుతున్నారా లేదా అనే ఆడిట్ కూడా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది స్పందన పోర్టల్‌లో సమస్య పరిష్కారానికి దరఖాస్తుదారునికి సరైన పరిష్కారం మార్గం చూపించకుండా ఫొటోలను మాత్రమే అప్‌లోడ్ చేస్తున్నారని కలెక్టర్ అన్నారు. స్పందన దరఖాస్తులు ఇక నుంచి ప్రతిరోజు సాయంత్రం 3.00 గంటల నుంచి 5.00 గంటల వరకు అధికారులు తమ కార్యాలయంలో అందుబాటులో ఉండి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సేవలకు చేసుకున్న దరఖాస్తులు రీఓపెన్ అయితే ఆ లబ్ధిదారులతో సీఎం నేరుగా మాట్లాడతారన్నారు. అభ్యంతరాలు ఉంటే వాటిపై జిల్లా అధికారులకు సమాచారం అందుతుందని వారు విధిగా తనిఖీలు నిర్వహించి నివేదికలు అందజేయాలని కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు.

తాగు, సాగునీటికి ముందస్తు ప్రణాళిక

సాక్షి, భీమవరం: తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పి. ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో హాల్లో నీటి వనరుల శాఖ అధికారులతో గురువారం సమావేశమై తాగునీరు, రబీ పంటకు సాగునీరు, ఇరిగేషన్ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగు, సాగు నీటి సరఫరాకు ఎట్టి పరిస్థితుల్లో లోటురాని విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు, రైతులకు సమాచారం తెలియజేయాలన్నారు. శివారు భూములైన పాలకోడేరు మండలం మోగల్లు, మైప, కాళ్ల మండలంలోని కొన్ని గ్రామాలకు నీటి ఎద్దడి తలెత్తకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, అగ్రికల్చర్ శాఖల సిబ్బందితో టీంలను ఏర్పాటు చేసి నీళ్ల అక్రమ తరలింపు జరకుండా విస్తృత తనిఖీలు చేపట్టాలన్నారు. పరిశ్రమలకు నీటి విడుదలను నిలుపుదల చేయాలని, చేపల చెరువులకు అక్రమ నీటి మళ్లింపు జరగకుండా నిరోధించాలన్నారు. క్రాస్ బండ్స్ ఏర్పాటు చేసి ఇంజిన్ల ద్వారా నీటినీ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

జిల్లాలో ఎన్నికల సందడి

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ జారీ
- జిల్లాలో ఇద్దరికి అవకాశం
- అధికార పార్టీ నుంచి ఎన్నిక లాంఛనమే
- మొదటిరోజు నామినేషన్లు నిల్



ఏలూరు కలెక్టరేట్ నామినేషన్ కేంద్రం వద్ద బందోబస్తు పరిశీలిస్తున్న ఆర్‌డీఓ కిషోర్, డీఎస్పీ పైడేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఎన్నికల సందడి మొదలైంది. స్థానిక సంస్థల కోటా నుంచి ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న ఇద్దరు సభ్యుల పదవీకాలం ముగియనుండటంతో భారత ఎన్నికల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ క్రమంలో జిల్లా నుంచి అధికార పార్టీకి చెందిన ఇద్దరు శాసనమండలి సభ్యులు ఎన్నిక లాంఛనం కానుంది. ఎన్నికల షెడ్యూల్ ఇప్పటికే ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. గురువారం నోటిఫికేషన్ జారీ కావడంతో ఎన్నికల నిర్వహణకు అవసరమైన పనులు నిర్వహించడంతో పాటు జిల్లాలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు చేస్తున్నారు.

2017లో టీడీపీ నుంచి జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో అంగర రామ్మోహనరావు, మంతెన సత్యనారాయణరాజు ఎన్నికయ్యారు. మే1తో పదవీకాలం ముగియనుండటంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 85 శాతం స్థానాలు దక్కించుకుని జిల్లాలోని బలమైన రాజకీయ శక్తిగా ఎదిగింది. ఈ క్రమంలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవసం చేసుకోనున్నారు. మరోవైపు నోటిఫికేషన్ జారీ అయిన క్రమంలో జిల్లా యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, 24న నామినేషన్ల పరిశీలన, 27న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించనున్నారు. మార్చి 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించి 16న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

గురువారం నుంచి నామినేషన్ స్వీకరణ ప్రక్రియకు ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. మొదటి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. 18న శివరాత్రి, 19న ఆదివారం ఈ రెండు సెలవు దినాల్లో నామినేషన్లు స్వీకరించరు. 23న మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి పీ.అరుణ్‌బాబు నామినేషన్ల స్వీకరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో 1105 మందికి ఓటు హక్కు

ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 1,105 మంది ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 48 మంది జెడ్పీటీసీలు, 856 మంది ఎంపీటీసీలు, 180 మంది కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, 21 మంది నగరపాలక, పురపాలక సంఘాల ఎక్స్‌ఆఫీషియో సభ్యులు, 15 మంది శాసనసభ్యులు, ఇద్దరు పార్లమెంటు సభ్యులు, నలుగురు ఎమ్మెల్సీలు మొత్తంగా 1,105 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఐదు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో ఐదు పోలింగ్‌స్టేషన్లు ఎంపిక చేశారు. ఏలూరు పోలింగ్ స్టేషన్‌ను ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఏలూరు నగరపాలక సంస్థతో పాటు 10 మండలాలకు చెందిన 249 మంది సభ్యులు అక్కడ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జంగారెడ్డిగూడెంకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపాల్టీ, 10 మండలాలకు చెందిన 154 మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు అక్కడ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కొవ్వూరుకు సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. కొవ్వూరు, నిడదవోలు మున్సిపాల్టీతో పాటు 9 మండలాలకు చెందిన 242 మంది ప్రజాప్రతినిధులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. నర్సాపురానికి సంబంధించి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. నర్సాపురం మున్సిపాల్టీతో పాటు 10 మండలాలకు చెందిన 229 మంది సభ్యులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. భీమవరానికి సంబంధించి భీమవరం ఎంపీడీఓ కార్యాలయంలో 10 మండలాలకు సంబంధించిన 201 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

సుందరగిరిపై ప్రారంభమైన మహాయజ్ఞం





యాగశాలలో శాలిగ్రామార్చనను నిర్వహిస్తున్న రుత్వికులు, యాగశాలలో ఏర్పాటు చేసిన కలశాలు

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహా సంపుటిత శ్రీ లక్ష్మీనృసింహ ధన్వంతరీ 28వ మహా యజ్ఞం గురువారం వైభవంగా ప్రారంభమైంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 18న రాత్రి ఈ మహాయజ్ఞాన్ని అట్టహాసంగా నిర్వహించనున్నారు. అందులో భాగంగా ప్రారంభం రోజు ఆలయంలో విశేష పూజాధికాలు నిర్వహించారు. ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన, ఐఎస్.జగన్నాథపురంలోని ఈ ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా యజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ యజ్ఞక్రతువును ప్రారంభించారు. ముందుగా యాగశాలలో ఏర్పాటు చేసిన శాలిగ్రామాలకు తులసీదళాలతో అర్చనను జరిపారు. సాయంత్రం గర్భాలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు గురూజీతో పాటు, యజ్ఞ పర్యవేక్షకులు సీహెచ్.కుటుంబరావు, అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాన్ని, పంచామృతాభిషేకాలను నిర్వహించారు. అనంతరం యాగశాలలో 1331 కలశాలను ఏర్పాటు చేసి, నవనారసింహ హోమాన్ని వేడుకగా జరిపారు.

ఉమ్మడి పరీక్షల కార్యదర్శిగా సర్వేశ్వరరావు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమ గోదా వరి జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శిగా ఏ.సర్వేశ్వర రావును నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శనివారపు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న సర్వేశ్వరరావుకు గురువారం రవిసాగర్ నియామకపత్రాన్ని అందచేశారు. సర్వేశ్వరరావు మూడు సంవత్సరాల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

శరవేగంగా ఈ–కేవైసీ నమోదు

- 77వేల మంది రైతుల వేలిముద్రల సేకరణ
- 1.98 లక్షల ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు
- జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో దాళ్వా సాగు



ఈ కేవైసీ నమోదు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: జిల్లాలో రైతుల ఈ కేవైసీ నమోదు ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. రైతులు పండించిన ధాన్యం దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా అమ్మకాలు చేసుకోవడానికి, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందడానికి ఈ క్రాప్‌తోపాటు ఈ కేవైసీ నమోదు తప్పనిసరి. అయితే ప్రస్తుత దాళ్వా సీజన్‌లో జిల్లాలో 2,15,256 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేస్తుండగా, గ్రామాల వారీగా వెబ్‌లాండ్ రికార్డుల్లో సర్వే నంబర్ల ఆధారంగా సాగు చేసిన పంటలను గుర్తిస్తారు. సంబంధిత రైతుల నుంచి పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్, బ్యాంక్‌ఖాతా, సెల్‌ఫోన్ నంబర్లు తీసుకుని ఆన్‌లైన్ చేస్తారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వం తక్కువ ధరలకు, సబ్సిడీపై పంపిణీ చేసే ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పరికరాలు వంటి వాటిని పొందడానికి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు పంటకు కలిగే నష్టాన్ని ప్రభుత్వం నుంచి పరిహారంగా పొందడానికి ఈ క్రాప్ నమోదు దోహదపడుతుంది. రైతులు నాట్లు వేసిన పంటను ముందుగా ఈ క్రాప్ చేయించుకోవాల్సి ఉండగా, జిల్లాలో ఇప్పటివరకు సుమారు 1.98 లక్షల ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు పూర్తి అయింది. ఈ క్రాప్ చేసిన పంటను ఆర్‌బీకే సహాయకులు గుర్తించాల్సి ఉండగా, ఇప్పటివరకు సుమారు 1.89 లక్షల ఎకరాల్లో పూర్తి చేశారు. అలాగే ఈ కేవైసీ నమోదు ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొత్తం 1.09 లక్షల మంది రైతులు ఉండగా, ఇప్పటి వరకు సుమారు 77 వేల మంది రైతుల నుంచి వేలిముద్రలు సేకరించారు. ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేసి మార్చి 15వ తేది నాటికి గ్రామాల వారీగా చివరి జాబితాలను ఆయా ఆర్బీకేలలో ప్రదర్శిస్తారు. ఈ క్రాప్ నమోదు, ఈ కేవైసీ ఈ నెల 20వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. కొంతమంది రైతులు స్థానికంగా లేకపోవడంతో వేలిముద్రలు వేసే విధానంలో గతంలో జాప్యం జరగగా, ప్రస్తుతం ఈ నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేవైసీ పూర్తి అయిన అనంతరం మార్చి 1 నుంచి 5వ తేదీ లోపుగా సోషల్ ఆడిట్ నిర్వహించి అభ్యంతాలను పరిశీలించి మార్చి 6 నుంచి 10వ తేదీ లోగా అభ్యంతరాలను పరిష్కరిస్తారు. రైతులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ విధానాన్ని వ్యవసాయ, రెవెన్యూ శాఖలు ఎంతో పకడ్బందీగా నిర్వహిస్తున్నాయి.

రైతులే స్వచ్ఛందంగా నమోదు

గడిచిన సార్వా సీజన్‌లో ఈ క్రాప్ నమోదు సక్రమంగా సకాలంలో పూర్తి చేయడంతో పంటను రైతులు ఆర్బీకేల్లో విక్రయించుకోవడంతో పాటు సకాలంలో ధాన్యం సొమ్ములు బ్యాంక్ ఖాతాల్లో వేయించుకోగలిగారు. గతంలో ఈ క్రాఫ్ నమోదు పూర్తి స్థాయిలో జరగకపోవడంతో ధాన్యం సొమ్ములు పొందడంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనిని గుర్తించి ప్రస్తుత దాళ్వా పంటకు ఈ క్రాప్ నమోదు చేయించుకోవడానికి రైతులు ఎంతో ఆసక్తి చూపుతున్నారు.

రైతులు సహకరిస్తున్నారు



ప్రస్తుత దాళ్వా పంటకుగాను ఈ కేవైసీ నమోదు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఈ క్రాప్ విధానంపై రైతులకు అవగాహన ఏర్పడడంతో అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఈ సీజన్‌లో సుమారు 2.15 లక్షల ఎకరాల్లో నాట్లు వేయగా ఈ కేవైసీ పూర్తిచేసి మార్చి 15వ తేది నాటికి సంపూర్ణంగా జాబితాలను ప్రకటిస్తాం.

– జెడ్. వెంకటేశ్వరరావు,
జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరు బాలల అరెస్టు

తణుకు: మోటారు సైకిళ్ల చోరీకు పాల్పడుతున్న ఇద్దరు బాల నేరస్తులను తణుకు పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అజ్జరం కాలనీలో నివాసం ఉంటున్న బాలుడితోపాటు సజ్జాపురం ప్రాంతానికి చెందిన మరో బాలుడు మోటారు సైకిళ్లు దొంగిలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని ఏలూరు జువైనల్ కోర్టులో హాజరు పరచగా స్పెషల్ హోంకు తరలిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు తణుకు సీఐ ముత్యాల సత్యనారాయణ చెప్పారు.

నేటి నుంచి పట్టిసీమకు ప్రత్యేక బస్సులు

తాడేపల్లిగూడెం అర్బన్: మహాశివరాత్రి సందర్భంగా తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి పట్టిసీమకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 19వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణ గురువారం చెప్పారు. శుక్రవారం నుంచి ఉదయం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు వీరంపాలెం దేవాలయానికి ఇక్కడి నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామన్నారు. సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు.

గంగాధరా.. లోక శుభంకరా

- శైవక్షేత్రాల్లో ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు
- గునుపూడి పంచారామక్షేత్రంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో భీమేశ్వరస్వామివారు



గునుపూడిలోని శ్రీసోమేశ్వరస్వామివారికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు

భీమవరం (ప్రకాశంచౌక్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు శైవక్షేత్రాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. భీమవరంలోని పంచారామక్షేత్రంలో కొలువైన శ్రీ ఉమా సోమేశ్వరస్వామివారికి తెల్లవారుజాము నుంచి ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షపత్రి పూజలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణం వాహన సేవలు జరిపారు. భీమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి మహోత్సవాల మొదటి రోజు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, లక్షబిల్వార్చన పూజలు చేశారు. శ్రీ మహిషాసురమర్దిని అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఆచంటలో మొదలైన శివరాత్రి సందడి

పెనుగొండ: ఆచంటలోని శ్రీ ఉమారామేశ్వర స్వామి (ఆచంటేశ్వరస్వామి) వారి కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి ఆచంట చేరుకుంటున్న భక్తులు, చిరు వ్యాపారులతో శివరాత్రి సందడి మొదలైంది. కచేరి సెంటరు నుంచి స్వామివారి సత్రం వరకూ పెద్ద ఎత్తున స్టాల్స్ ఏర్పాటు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటున్నాయి. స్వామివారి కల్యాణమహోత్సవం సందర్భంగా స్వామివారు, అమ్మవార్లకు గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి రామలింగేశ్వర రావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు. శ్రీ పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్వామివారి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు, సత్రంలో అన్నదానం ప్రారంభించారు. శ్రీస్వామివారి గ్రామోత్సవం వివిధ వాహనాలపై కన్నులపండుగగా సాగింది.

పెండ్లి కుమారుడైన పాతాళ భోగేశ్వరుడు

కైకలూరు (కలిదిండి): కలిదిండి సమీపంలోని శ్రీపాతాళ భోగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా విఘ్నేశ్వరపూజ, స్వామివార్ని, అమ్మవార్ని పెండ్లి కొడుకు, పెండ్లి కుమార్తెలను చేశారు. సాయంత్రం పుణ్యాహవాచనం, దీక్షాదారణ, త్రిశూలపూజ, అంకురారోహణ, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠ, ధ్వజరోహణ, బలిహారణ పూజలను అర్చకులు ఐలూరు శ్రీకృష్ణ బసవయ్య, ఉమాశంకర శర్మలు నిర్వహించారు. ఈ నెల 20వ తేదీ వరకు కొనసాగే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17 రాత్రి స్వామి వారి దివ్య కల్యాణ్యం, 18న మహాశివరాత్రి ఉత్సవం (తీర్థం), అదే రోజు రాత్రి హంస వాహనంపై స్వామివారి తెప్పోత్సవం నిర్వహించనున్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న నెక్కంటి రామలింగేశ్వరరావు, రామచంద్రకుమార్

అమ్మవారి విగ్రహం ఏర్పాటుపై ఉద్రిక్తత

ఆకివీడు: అమ్మవారి విగ్రహం ఏర్పాటుపై పట్టణంలోని రాళ్ల చెరువు వద్ద ఉద్రిక్తత నెలకొంది. గాంధీనగర్‌కు చెందిన శ్రీకృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా రాళ్ల చెరువు ప్రాంతంలో కనకదుర్గమ్మ అమ్మవారి నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రాంతంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటుకు బుధవారం రాత్రి దిమ్మె నిర్మించారు. దీనిని ఆ ప్రాంత స్థానికులు, రజకులు అడ్డుకున్నారు. గురువారం యూత్ సభ్యులు దిమ్మెపై అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడంతో మాదివాడ దళితులు, రజకులు అడ్డుపడటంతో ఉద్రిక్తత నెలకొంది. తమ పేటకు సమీపంలో అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేయడం తగదని, తాము అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసుకుంటామని చెప్పడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి ఆకివీడు రూరల్ సీఐ గీతా రామకృష్ణ, ఎస్సై కే.రాజారెడ్డి, పోలీసులు చేరుకున్నారు. ఇరువర్గాల్ని వారించి పంపించివేశారు. అయితే మధ్యాహ్నం పోలీసులు లేని సందర్భంలో మరోసారి ఉద్రిక్తత నెలకొనగా, నగర పంచాయతీ కమిషనర్ సూచనల మేరకు అమ్మవారి విగ్రహాన్ని ఆ ప్రాంతం నుంచి తొలగించారు. సమస్య పరిష్కరించేందుకు మూడు రోజుల సమయం ఇవ్వాలని పెద్దలు అధికారులను కోరారు. పెద్దల విజ్ఞప్తితో ఇరువర్గాలు అక్కడ నుంచి నిష్క్రమించారు.



ఆకివీడు రాళ్ల చెరువు ప్రాంతంలో స్థానికుల మధ్య వాగ్వివాదం దృశ్యం

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ : పెనుగొండలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

అత్యాచార యత్నంపై కేసు నమోదు

పెదవేగి: అప్పు చెల్లించాలని ఇంటికి వెళ్లి అడగగా అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ గురువారం చెప్పారు. రాట్నాలకుంటకు చెందిన ఏలేటి దేవమాత అదే గ్రామానికి చెందిన తేరా ప్రసాద్‌కు రూ.5 లక్షలు అప్పు ఇచ్చింది. ఈ సొమ్ము తిరిగివ్వాలని ఈ నెల 1న అతని ఇంటికి వెళ్లగా తనపై అత్యాచార యత్నం చేశాడు. దీనిపై పెద్దల్లో పెట్టినా పరిష్కారం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎస్సీలపై దాడులు చేస్తే కఠిన చర్యలు

ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

సాక్షి, భీమవరం : ఎస్సీ, ఎస్టీలపై దాడులు చేస్తున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ ఎం.విక్టర్‌ప్రసాద్ అన్నారు. గురువారం భీమవరంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ అఖిల పక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీలకు అనేక సమస్యలు ఉన్నాయని, వారికి అందాల్సిన అనేక సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించడమేగాక ప్రైవేట్ రంగంలో వారికి రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఎస్సీలకు ప్రత్యేకంగా శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు వినతిపత్రాలను అందించామన్నారు. ఎస్సీ కమిషన్ ఎంతో బాధ్యతగా పనిచేస్తోందని, ఎస్సీలకు ఎటువంటి సమస్య వచ్చినా సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో కొనా జోసెఫ్, తాళ్లూరి మధు, పడమటి బాలకృష్ణ, సోడదాసి గంగయ్య, సీహెచ్ మంగరాజు, గుమ్మాపు వర ప్రసాద్, బుంగా ఆదాము, మట్టి రాజ్‌కుమార్, సోడదాసి శ్రీధర్, బూసి బెనర్జీ, నక్కా శాస్త్రి, కోరం ముసలయ్య, కేసీ రాజు, రమేష్‌బాబు పాల్గొన్నారు.



భీమవరం సమావేశంలో మాట్లాడుతున్న విక్టర్‌ప్రసాద్

ఎస్సై అభ్యర్థులకు హెల్ప్ డెస్క్‌లు

ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ



ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పరిధిలో ఎస్సై పోస్టులకు ఈ నెల 19న నిర్వహించే ప్రిలిమినరీ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం రైల్వేస్టేషన్లు, బస్టాండ్‌లలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ చెప్పారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొత్తం 9014 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారన్నారు. పరీక్షా కేంద్రాలను చేరుకునేందుకు మార్గాన్ని తెలియజేసే రేఖా చిత్రాన్ని సైతం హెల్ప్ డెస్క్‌ల వద్ద అభ్యర్థుల అవగాహన కోసం ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద డీఎస్పీ నుంచి ఎస్సై స్థాయి అధికారులతోపాటు భారీగా పోలీస్ బందోబస్తు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి అదనపు సమయాన్ని ఇవ్వరనే విషయాన్ని అభ్యర్థులు గుర్తించాలన్నారు. అలాగే హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డును విధిగా వెంట తీసుకుని రావాలని సూచించారు.



క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి


తణుకులో రక్తదానం చేస్తున్న దాతలు

తణుకు: రక్తదానం చేసి ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని కారుమంచి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బ్లడ్ బ్యాంకు మేనేజర్ కారుమంచి యోహాన్ అన్నారు. కారుమంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ప్రాంగణంలో గురువారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సుమారు 11 మంది రక్తదాతలు తమ రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వంశీమణికంఠ, జయకృష్ణ, చింటూ, సాయి, శ్రీను, ఏసు, పూర్ణ, రాంబాబు, శశికుమార్, మణి, చిట్టిబాబులను పలువురు అభినందించారు.

దుప్పట్ల పంపిణీ


తణుకు అగ్ని ప్రమాద బాధితులకు సహాయం అందజేస్తున్న స్వర్ణ క్లబ్ సభ్యులు

తణుకు టౌన్: పట్టణంలోని పాతూరులో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధితులకు తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు వావిలాల వెంకట రమేష్, సరళాదేవి ఆధ్వర్యంలో దుస్తులు, దుప్పట్లతో పాటు స్టీల్ సామాన్లు, నిత్యావసరాలను అందజేశారు. గురువారం తణుకు పాతూరులోని శివాలయం వద్ద గల బాధితులను స్వర్ణ లయన్స్ క్లబ్ సభ్యులు పరామర్శించి వారికి దుస్తులు, స్టీల్ సామాన్లు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు సూర్యచంద్రరావు, కార్యదర్శి దామెర సురేఖలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రంభ నాగేశ్వరరావు, కాకరపర్తి నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

చిన్నారులకు హిమోగ్లోబిన్ పరీక్షలు


పెదతాడేపల్లి గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ గురుకుల విద్యార్థులకు గురువారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ హెల్త్ మేళా కార్యక్రమంలో భాగంగా ఈ పరీక్షలు చేసినట్లు సీహెచ్‌వో డి.ప్రవల్లిక తెలిపారు. 360మంది చిన్నారులకు హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉన్నది పరీక్షలు చేశారు. ఈ నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బి.రాజారావు, జి.పాదం, రత్నం, ఆశా వర్కర్లు, గురుకుల హెల్త్ సూపర్ వైజర్ ఎం.జ్యోత్స్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మోటారు సైకిలిస్టుకు గాయాలు

తణుకు: పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంపై పట్టణ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెరవలి గ్రామానికి చెందిన షేక్ రఫీ అనే వ్యక్తి ఈనెల 14న రాత్రి సమయంలో యాక్టివా మోటారు సైకిల్‌పై తణుకు వైపు వస్తుండగా స్థానిక డీమార్ట్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రఫీను చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బాల్య వివాహాలపై అవగాహన


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): దుర్గాపురం హైస్కూల్లో ఐసీడీఎస్ సిబ్బంది బాల్య వివాహాల వల్ల కిశోర బాలికలు ఎదుర్కొనే ఇబ్బందులు గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పీబీవీఎల్ సరోజిని మాట్లాడుతూ బాల బాలికలు అందరూ విద్యపై దృష్టి పెట్టి ఉన్నత విద్యావంతులు కావాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు పెళ్లి ప్రయత్నాలు చేస్తే ముందుగా తల్లిదండ్రులను ఒప్పించి తాము బుద్ధిగా చదువుకొని ముందుకు వెళతామని నమ్మకాన్ని వారికి పిల్లలు కలిగించాలన్నారు. కనీసం డిగ్రీ వరకు చదువుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వేగేశ్న విశ్వనాథ రాజు, ఏఎన్‌ఎం ఉషశ్రీ, స్థానిక అంగన్‌వాడీ టీచర్స్ చిన్నారమ్మ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఆధ్యాత్మిక శోభ

- శివరాత్రికి ఆలయాలు ముస్తాబు
- ఏర్పాట్లు చేస్తున్న కమిటీలు

తణుకు అర్బన్: మండలంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. ఈనెల 18వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి వేడుకలకు సర్వం సిద్ధం చేస్తున్నారు. శివరాత్రి మహోత్సవానికి పాతవూరు ఉమా సిద్దేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. శివ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఈనెల 17వ తేదీన ఉదయం స్వామివారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి సాయంత్రం 4 గంటలకు మేళతాళాలతో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారని ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. రాత్రి 8 గంటలకు వేద మంత్రోచ్ఛరణముల మధ్య స్వామివారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని వివరించారు. 18వ తేదీ మహా శివరాత్రి సందర్భంగా స్వామి వారి దివ్యదర్శనం, 19న రుద్రాభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధికసంఖ్యలో ఆలయానికి తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు క్యూలైన్‌లో వెళ్లి స్వామివారిని దర్శించుకునేలా బారికేడ్లు ఏర్పాటుచేశారు.

పెంటపాడులో..

మహాశివరాత్రి పురస్కరించుకొని పురాతన దర్శిపర్రులో పార్వతి బ్రహ్మలింగేశ్వర, వల్లీ దేవసేన సమేతసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శివనామ కల్యాణోత్సవాలు శుక్రవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరగబోయే ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం వెలుపల చలువపందిళ్లు వేసారు. శాంతి కల్యాణం కోసం ప్రత్యేక యాగ శాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ధర్మకర్త శ్యాం మాట్లాడుతూ లోకశాంతి కోసం గత 40 ఏళ్లకు పైగా ఈ ప్రాంతంలో శాంతిహోమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కాశీ నుంచి తమ పూర్వీకులు ఈ శివలింగాన్ని ప్రత్యేకంగా ఇక్కడకు తెచ్చి పూజలు నిర్వహిస్తున్నారన్నారు. శివునికి మహాప్రీతీపాత్రమైన మాసశివరాత్రి సందర్భంగా ఎన్నో ఏళ్లకు వచ్చే ఈ శివరాత్రికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఈ రోజుల్లో శాంతిహోమంలో పాల్గొనే భక్తులకు ఇహలోక సౌఖ్యంతో పాటు పరలోకంలో ముక్తి కలుగుతుందన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శివపార్వతుల కృపను పొందాలన్నారు. అలాగే మహాశివరాత్రి పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తిచేసారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి కల్యాణాలు, శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు దర్శనాలు చేసుకొనేందుకు వీలుగా ఆయా ఆలయాల ఉత్సవకమిటీలు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.


దర్శిపర్రులో కాశీ నుంచి తెచ్చిన శివలింగ పార్వతి బ్రహ్మలింగేశ్వరుడు


దర్శిపర్రులో పురాతన బ్రహ్మలింగేశ్వరుని ఆలయం

విద్యార్థులకు అర్థమయ్యేలా బైజూస్ విద్యాబోధన


ఎంపీయూపీ పాఠశాల విద్యార్థుల బైజూస్ వినియోగాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో వి.హనుమ

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులకు అర్థమయ్యేలా బైజూస్ విద్యాబోధన ఉంటుందని ఎంఈవో వి.హనుమ అన్నారు. గురువారం మండలంలోని అప్పారావుపేట, పుల్లాయగూడెం గ్రామాల్లోని ప్రాథమికోన్నత, తాడేపల్లిగూడెం పట్టణంలోని సంజీవ్‌నగర్, కడకట్ల, సుబ్బారావుపేట ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బైజూస్ యాప్ వినియోగాన్ని పరిశీలించారు. తరగతి గదిలో అర్థం కాని అంశాలను బైజూస్ ద్వారా పునశ్చరణ చేసుకోవచ్చని ఎంఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.సుకుమార్, ఎం.శివకుమార్, బి.బ్రహ్మం, కె.వనజ, శ్రీనివాసరావు, సీఆర్‌పీ బత్తుల నాని తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

యలమంచిలి: జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పిచ్చియ్య చెప్పారు. మండలంలోని మేడపాడు, కలగంపూడి, చించినాడ, గంగడుపాలెం గ్రామాలలోని జగనన్న కాలనీల్లో కొత్తగా వేసిన రోడ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీల్లో నూరు శాతం రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు వివరించారు. యలమంచిలి మండలంలో ఓటీఎస్ నిధులు మేడపాడులో రూ.4.89 లక్షలు, కలగంపూడిలో రూ.18.30 లక్షలు, చించినాడలో రూ.4.98 లక్షలు, గంగడుపాలెంలో రూ.4.90 లక్షలతో రోడ్లు నిర్మిస్తున్నట్లు వివరించారు. ఆయన వెంట గృహ నిర్మాణ శాఖ డీఈ రామాయణం త్రిమూర్తులు, వర్క్ఇన్స్‌పెక్టర్ మత్తే బాబ్జి ఉన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు వీరంపాలెం సర్వం సిద్ధం

తాడేపల్లిగూడెం రూరల్: దేశంలోనే రెండవ దక్షిణ కాశీగా వెలుగొందుతున్న తాడేపల్లిగూడెంమండలం వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పీఠం మహాశివ రాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. కాశీ మాదిరిగా పదుల సంఖ్యలో ఆలయాలు ఒకే చోట నెలవైన రెండవఆలయంగా వీరంపాలెంను పేర్కొంటారు. అంతే కాకుండా స్పటికలింగ దర్శనం ఇక్కడి ప్రత్యేకతగా పేర్కొనవచ్చు. ఇటువంటి అవకాశం భక్తులకు వీరంపాలెం శైవక్షేత్రంలో తారసపడుతుంది. ప్రశాంతమైన వాతావరణంలో నిర్మితమైన ఈ శైవక్షేత్రం ఆధ్యాత్మికతతో పరిఢవిల్లుతోంది. దీనికితోడు మహాశివరాత్రి ఉత్సవాలు సైతం ఈ నెల 17 నుంచి 19వ తేది వరకు నిర్వహించేందుకు ఆలయ వ్యవస్థాపకులు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి ఏర్పాట్లు పూర్తి చేశారు. శివరాత్రి ఉత్సవాల్లో దూరప్రాంతాలనుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం రాత్రి సమయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రముఖుల ప్రవచనాలను ఏర్పాటుచేశారు. పోలీసు బందోబస్తుతోపాటు ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం తాడేపల్లిగూడెం డిపో నుంచి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు.


మహాశివరాత్రి సందర్భంగా ఏర్పాటు చేసిన క్యూలైన్లు, గ్రీన్ షేడ్ నెట్ వసతి


తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం శైవక్షేత్రంలో స్పటిక లింగం కొలువైన ప్రాంతం

ఆధునిక నైపుణ్యాలు పెంచుకోవాలి


నిట్ సందర్శనలో జవహర్ నవోదయ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: విద్యార్థులు ఆధునిక నైపుణ్యాలు పెంచుకోవాలని ఏపీ నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వి.సందీప్ సూచించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన టెన్త్, ఇంటర్ చదివే విద్యార్థులు గురువారం నిట్‌ను సందర్శించారు. సందీప్ మాట్లాడుతూ దేశ భవిష్యత్‌లో విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమైందన్నారు. విజయాలే లక్ష్యంగా ఆలోచనలకు పదునుపెట్టాలన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన వృత్తుల్లో స్థిరపడాలంటే నిత్యం కొత్త విషయాలను తెలుసుకొనేందుకు ఆసక్తి కనపర్చాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో రాణించాలంటే మార్కులొక్కటే సరిపోవని, వాటితో పాటు ఆధునిక నైపుణ్యాలు, వ్యక్తిగత సామర్థ్యాలను కూడా పెంచుకోవాలన్నారు. విద్యాలయాల్లో నేర్చుకున్న సాంకేతిక పరిజ్ఞానానికి తమ సృజనాత్మకత ఆలోచనలను జోడించి సమాజహిత పరిశోధనలపై దృష్టిసారించాలన్నారు. విద్యార్థులు నిట్ ప్రాంగణ నమూనా, ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, వర్కుషాపులు, గ్రంథాలయాలను పరిశీలించారు. నవోదయ ఆచార్యులు డాక్టర్ సుధీర్‌కుమార్, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పంటబోదె శుభ్రం

పెంటపాడు: సాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా మీనవల్లూరు గ్రామ రైతులు గత రెండు రోజులు నుంచి స్వచ్ఛందంగా పంటబోదెను బాగు చేసుకున్నారు. వెంకయ్యకాలువ నుంచి నెంబర్ -1 చానల్ ద్వారా సాగునీరందించే ఈ కాలువ రావిపాడు, కోరిమిల్లి, మీనవల్లూరు గ్రామాల మీదుగా పిప్పర చేరుతుంది. కోరిమిల్లి , మీనవిల్లూరు రైతులు సుమారు 200 మంది కలిసి స్వచ్ఛందంగా బాగుచేసుకొన్నారు. ఈ సాగునీరందించే పంట బోదె ఇటీవల గుర్రపుడెక్క తూడుతో తీవ్రంగా నిండిపోయింది. చేలకు సంపూర్తిగా నీరు అందకపోవడంపై గ్రామ రైతులు స్వచ్ఛందంగా బాగుచేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో మీనవిల్లూరు పార్టీ నాయకులు చింతపల్లి శ్రీనివాస్, కోరిమిల్లి గ్రామ సర్పంచ్ వల్లూరు సత్యవతి, పార్టీ సీనియర్ నాయకులు వల్లూరి బ్రహ్మనందం తదితరులు ఉన్నారు.


మీనవల్లూరు గ్రామంలో పంటబోదెను బాగు చేసుకొంటున్న రైతులు

మంత్రి పరామర్శ


పైబోయిన విజేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి

అత్తిలి: వైఎస్సార్‌సీపీ అత్తిలి మండల అధ్యక్షుడు, అత్తిలి సొసైటీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ తండ్రి పైబోయిన విజేయులు దశదినకర్మ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు హాజరయ్యారు. విజేయులు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పైబోయిన కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, రాష్ట్ర మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, మండల పరిషత్ సభ్యురాలు మెట్ల కిరణ్మయి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆకుల చినబాబు తదితరులు హాజరయ్యారు.

సుబ్బరాజు కుటుంబాన్ని పరామర్శించిన మంత్రికారుమూరి

అత్తిలి: గుమ్మంపాడు గ్రామానికిచెందిన గ్రామ ప్రముఖులు నడింపల్లి సుబ్బరాజు కుటుంబ సభ్యులను రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు పరామర్శించారు. సుబ్బరాజు మాతృమూర్తి నడింపల్లి సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మంత్రికారుమూరి నాగేశ్వరరావు సత్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేగేశ్న ధనసత్యనారాయణరాజు, మాజీ సర్పంచ్ పెన్మెత్స రామరాజు తదితరులు ఉన్నారు.

వైభవంగా సంతాన గోపాలస్వామివారి కల్యాణోత్సవం

అత్తిలి: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత సంతాగ గోపాలస్వామివారి కల్యాణం గురువారం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం స్వామి వారికి సహస్ర నామార్చనలు, విశ్వక్సేన పూజ అనంతరం స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన జవ్వాది సురేష్, కుసుమ దంపతులచే స్వామివారి కల్యాణతంతు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లీ వెంకటేష్ ఆధ్వర్యంలో పూజాదికాలు చేసారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి, దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేసారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శ్రీలలితా విష్ణు సహస్రనామ పారాయణం చేసారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త లింగంపల్లి పాండురంగారావు, భక్తులు పాల్గొన్నారు.


అత్తిలిలో శ్రీసంతాన గోపాలస్వామివారి కల్యాణోత్సవ దృశ్యాలు

కమ్యూనిటీ హాల్ నిర్మాణాలు ఐక్యతకు నిదర్శనం

పాలకోడేరు: కమ్యూనిటీ భవన నిర్మాణాలు ఐక్యతకు నిదర్శనమని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేను రాజు అన్నారు. విస్సాకోడేరు పెద్దపేటలోని స్థానిక సభ్యుల సహకారంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక భవన నిర్మాణాలు ఐక్యతకు దహదపడతాయని ఈ భవనాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు భూపతి రాజు చంటి రాజు, సర్పంచ్ బొల్లా శ్రీనివాస్, పెన్మత్స గోపాలకృష్ణంరాజు, మాజీ సర్పంచ్ పెన్మత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్ బాబు, వైస్ ఎంపీపీ సోడదాసి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభం

పాలకోడేరు: దేవాలయాలు, చర్చిలు, మసీదులను సందర్శిస్తే మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. గురువారం ఆయన గొల్లలకొడేరు లో నూతనంగా నిర్మించిన సెయింట్ పాల్ లూథరన్ చర్చ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కుక్కల లక్ష్మి, ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్, బిషప్ పరదేశి బాబు, ఎమ్మెల్యే మంతెన రామరాజు, కలిదిండి శ్రీనివాసవర్మ, ఎంపీటీసీ సభ్యురాలు కరోతి లక్ష్మి, చేకూరి నరేంద్ర వర్మ తదతరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ యాప్ ద్వారా ఉచిత సర్వీస్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైనింగ్ విద్యార్థినుల ఆధ్వర్యంలో కళాశాల మహిళ హాస్టల్‌లో భీమవరం ఆన్‌లైన్ యాప్‌లో ఎస్ఆర్‌కేఆర్ గరల్స్ హాస్టల్ స్టాల్‌ను గురువారం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కే నిశాంత్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాల్ నిర్వాహకురాలు కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ విద్యార్థిని శరణ్య మాట్లాడుతూ ఇంటి వద్ద మహిళలతో తయారు చేసిన చక్కని భోజనంతో పాటు రకరకాల బిర్యానీలు, స్వీట్స్, మెడిసిన్స్ ఎలాంటి సర్వీస్ చార్జీలు లేకుండా అందిస్తామన్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి మాత్రమే ఇలాంటి అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఉపయోగపడే స్టేషనరీ ఐటమ్స్ కూడా అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం జగపతి రాజు, ఎస్.గోపాలకృష్ణమూర్తి, హాస్టల్ వార్డెన్ సీఆర్‌కే రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నివారణతోనే పంట దిగుబడులకు రక్షణ


ఎలుకల నివారణమందు తయారీని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు


ఆకుతీగపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఎలుకల మందును కలుపుతున్న దృశ్యం


దువ్వలో రైతులకు బ్రోమోడైల్ మందును పంపిణీ చేస్తున్న ఎంపీపీ రుద్రా ధనరాజు, వ్యవసాయ సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: సామూహిక ఎలుకల నివారణతోనే పంట దిగుబడులను రక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని కృష్ణాయపాలెం గ్రామంలో సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతుకు నష్టం కలిగించే వాటిలో ఎలుకలు ఒకటని, వీటిని సామూహికంగానే రైతులు ఎదుర్కోవాలన్నారు. ఎలుకల నివారణ మందును ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేస్తుందని, రైతులంతా ఏకకాలంలో వీటిని ఎలుక బొరియల్లో పెట్టి సత్ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సర్పంచ్ బోడేపూడి వెంకటసుబ్బలక్ష్మి, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, రైతు కంఠమని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో : ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని రైతులు ఉద్యమంలా చేపట్టాలని గూడెం ఏడీఏ పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. నియోజకవర్గంలో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా గురువారం పెంటపాడు మండలంలోని 22 గ్రామాల్లో సుమారు 99 కేజీల మందును నూకలు, మంచినూనెతో కలిపి పొట్లాలుగా కట్టి గురువారం రైతులకు అందించారు. ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాల వద్ద రైతులకు ఈ మందు పొట్లాలను ఉచితంగా అందించినట్లు ఏఈఏ తెలిపారు. ఆకుతీగపాడు గ్రామంలో మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధి, జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ గతంలో ఎలుకల ఉధృతి వల్ల తీవ్రంగా రైతులు నష్ట పోయేవారన్నారు. జట్లపాలెం గ్రామంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో రైతులకు ఎలుకల మందును పంపిణీ చేసారు. ఆయా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎలుకల మందును వీఏఏలు, వ్యవసాయ సలహామండలి సభ్యులు, వలంటీర్లు పంపిణీ చేశారు.

తణుకు టౌన్‌లో : దాళ్వా పంటలో ఎలుకల నివారణకు సంబంధించి సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా గురువారం తణుకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో ఎలుకల నిర్మూలన మందును పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి కే కుసుమ తెలిపారు. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ఆధ్వర్యంలో జరిగిన సామూహిక ఎలుకల నిర్మూలన కోసం మందు పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని పంపిణీ చేశారు. ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, గ్రామ సర్పంచ్‌లు అడ్డా బాబు, రైతు విభాగం అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు, తుమ్మగంటి సత్యనారాయణ, ముళ్లపూడి బాబూరావు, ఏఈవో టీ వీరభద్రుడు, వీఏఏలు చందు, రాణి, పుష్పలత, మల్లికార్జునరావు, సత్యవాణి పాల్గొన్నారు.